‘ఛ ఎప్పుడూ లేంది అదేం నవ్వు బాస్?..... గట్టిగా భయంకరంగా నవ్వేవారు కదా బాస్?..... ఈ వేళ మీకేమైంది బాస్?.....

‘ఈ శనిగాడు అలా ఎందుకు నవ్వేవాడో’ కసిగా తిట్టుకుని ‘సరే ఏడవండి..... హ్హాహ్హాహ్హా.....’ అని నవ్వాడు రాంబాబు.

జాకాలు తృప్తిగా తల ఊపాడు.

‘బాస్ ..... ఇప్పుడే జగ్గూ, వీరూలు మరో పిట్టని తీసుకొచ్చారు బాస్....దాన్ని సింగపూర్‌కి పంపిద్దాం బాస్.....’

‘వాళ్లా.... ఒట్టి సన్నాసి వెధవలు! మగాళ్లని తెచ్చి ఆడాళ్లని అనుకుంటారు!!.....హ్హాహ్హాహ్హా.....’

‘లేదు బాస్ .... అమ్మాయే!..... ఒరేయ్ ఆ అమ్మాయిని లాక్కురండిరా.....’ అన్నాడు జాకాలు.

జగ్గూ, వీరూలు ఒకమ్మాయినీ, అబ్బాయినీ లాకొచ్చారు.

వాళ్ళని చూస్తూనే రాంబాబు కెవ్వుమని అరిచాడు. వాళ్ళు ఎవరో కాదు సుబ్బలక్ష్మి, నాగరాజులు.

‘వీళ్ళనెలా తెచ్చారు?’

‘వీళ్ళు పబ్లిక్ గార్డెన్‌లో మాట్లాడుకుంటుంటే చూసి తీసుకొచ్చాం బాస్.....’ అన్నాడు వీరూ గుండుమీద రుద్దుకుంటూ.

‘ఆ అబ్బాయినెందుకు తెచ్చారు? అతన్నీ ఆ అమ్మాయి వెంట తోడుగా సింగపూరు పంపిద్దామనా?...హ్హాహ్హాహ్హా....’

వెధవ నవ్వు.... ఆయాసం వస్తుంది. తిట్టుకున్నాడు రాంబాబు.

‘మేం కావాలని తేలేదు బాస్ ....మేము ఇతన్ని కిందపడేసి ఆ అమ్మాయిని ఎత్తుకుని వచ్చేసాం బాస్..... అతను మోటర్ సైకిల్‌తో మమ్మల్ని ఫాలో అయ్యాడు బాస్.....’ అన్నాడు వీరూ.

‘సన్నాసుల్లారా...మీరేం పనిచేసినా ఇలానే చేస్తారు.... ఇంక ఆ అబ్బాయికి అక్క చెల్లెళ్ళు, అన్నదమ్ములు ఎవరైనా ఉంటే వాళ్లనీ తీసుకురాలేకపోయారా?....’ అన్నాడు కోపంగా రాంబాబు తనే అసలయిన బాస్ అయినట్టు.

‘అలాగే బాస్....’ అంటూ వెనుతిరిగారు జగ్గూ, వీరూ.

‘ఆగండి!......జాకాలు .....వీళ్లిద్దరికీ చెరో పది కొరడా దెబ్బల్ని తగిలించు .....హిహిహి ......’ అని నవ్వి మళ్ళీ నాలుక కరుచుకుని ‘హుహూహూ హ్హొహ్హొహ్హొ....’ అని నవ్వాడు రాంబాబు.

జాకాలు జగ్గూ వీరూలకి చెరో పదేసి కొరడా దెబ్బలు కొట్టాడు.

రాంబాబు నాగరాజు వంక చూ శాడు.

వీడు సుబ్బలక్ష్మిని ఇంకా మోసం చెయ్యడం మానలేదన్నమాట!!

'ఏం బాబూ?... అ అమ్మాయికి తీయని కబుర్లు చెప్పి పార్కుల వెంట తిప్పి మోసం చేద్దామని అనుకుంటున్నావా?.....' అన్నాడు నాగరాజుని ఉద్దేశించి.

'అబ్బే.....లేదండీ ...నాకా ఉద్దేశం లేదండీ' అన్నాడు నాగరాజు.

'షటప్...నోర్ముయ్! ఇతనిక్కూడా పది కొరడాదెబ్బలు కొట్టండి' అన్నాడు రాంబాబు జాకాలు రేండడుగులు ముందుకు వేసాడు.

'అతన్ని ఆపండి బాస్‌గారూ....ఆయన నన్నేం మోసం చెయ్యడం లేదు..నన్ను పెళ్ళి చేసుకోడానికి కూడా ఒప్పుకున్నాడు....మధ్యాహ్నం మా అమ్మానాన్నలు ఆయన్ని ఆడిగితే అలానే అని ఒప్పుకున్నారు.... ఆ తరువాత మేం సర్దాగా పార్కుకి వెళితే మీ వాళ్ళు నన్నెత్తుకు వచ్చారు...... బాస్‌గారూ! నన్ను వదిలిపెట్టండి.....' ప్రాధేయపడింది సుబ్బలక్ష్మి.

'నన్ను అని నీ ఒక్కదాని గురించే అడుగుతావేం?...... నాగురించి కూడా అడుగు' సుబ్బలక్ష్మి చెవిలో అన్నాడు నాగరాజు.

'పాపం ఆయన్ని కూడా వదిలిపెట్టండి......' మళ్ళీ ప్రాధేయపడింది సుబ్బలక్ష్మి.

'తెలుగు ఆడపడుచు కళ్ళనీళ్ళు పెట్టకూడదు....వీళ్ళిద్దర్నీ వదిలి పెట్టెయ్యండి......హహహ.....' అంటూ నవ్వాడు రాంబాబు.

డెన్‌లోని రౌడీలందరూ హాహాకారాలు చేశారు జాకాలుతో సహా.

'అంతిదిగా హాహాకారాలు చేస్తారేం?..... ఈ మాత్రం అమ్మాయి మనకి దొరకదా?..... ఆమెని వదిలి పెట్టండి.....' అన్నాడు రాంబాబు కోపంగా.

కానీ డెన్‌లోని రౌడీలందరూ హాహాకారాలు చేసింది రాంబాబు అన్న మాటలకి కాదు రాంబాబు వెనకాల ఫెల్ట్‌హ్యాట్‌తో ప్రత్యక్ష మైన అసలు బిగ్‌బాస్‌ని చూసి.

బిగ్‌బాస్ పిస్తోలు మడమతో రాంబాబు నెత్తిమీద కొట్టాడు.

రాంబాబు కిక్కురుమనకుండా నేలమీదికి ఒరిగిపోయాడు.

### *సరోజ రంగంలో దిగింది!*

రాత్రి ఎనిమిదిన్నర కావొస్తుంది.

అప్పుడే భోజనం చేసి వచ్చిన సరోజ మంచంమీద కూర్చుంది.

రాంబాబు కిష్టయ్య రంగనాథరావు ఇంటికి వెళ్ళి ఉంటారు.....వాళ్ళు వెళ్ళినపని ఏమైందో అనుకుంది సరోజ.

ఏదైనా పుస్తకం చదువుదామంటే ఆమె మనసు పుస్తకం మీద నిలవడంలేదు. మనసంతా చికాకుగా ఉంది. ఆలోచనలన్నీ రాంబాబు మీదే ఉన్నాయి.

సరోజ చేతిమీద చురుక్కుమని అనడంతో ఆలోచనల్లోంచి తేరుకుని చేతివంక చూస్కుంది. ఒక ఎర్రచీమ చేతిని కుడ్తూంది.

చేతిమీద ఇంకో చోట చురుక్‌మంది. అక్కడ మరో ఎర్రచీమ కుడుతుది.

చీమల్ని దులుపుకుని లేచి నిలబడి పక్కవంక చుసింది. దుప్పటి మీద ఎర్రచీమలు పాకుతున్నాయ్.

పాడు ఎర్రచీమలు! ఎక్కడినుండి వచ్చయో!!'

దుప్పటి తీసి దులిపింది. మళ్ళీ పక్కపరిచి కూర్చుంది. కాస్సేపయ్యాక మళ్ళీ ఎర్రచీమలు దుప్పటిమీద పాకసాగాయి.

'చీమలు పరుపుకుంద నుండి వస్తున్నట్టున్నాయ్' అనుకుంది సరోజ.

పరుపు ఎత్తి చూసింది.

అక్కడ ఫోటోలు ఉన్నాయి. వాటిని తీసి పక్కనపెట్టి పరుపు తీసి దులిపి మళ్ళీ పక్క పరిచింది.

సరోజ దృష్టి ఫోటోలమీద పడింది.

ఏం ఫోటోలవి?!.....

ఆమెకి గుర్తుకు వచ్చింది.

అవి నీలిమ తీసిన ఫోటోలు. ఆ ఫోటోలు చూస్తున్నప్పుడే రాంబాబు నీలిమతో ఉన్న ఫోటోని చూసింది.

పాపం?.... రాంబాబుని అప్పుడు అనవసరంగా అనుమానించింది తను.

సరోజ నవ్వుకుంది.

ఆ ఫోటోల్లో కేవలం మూడు నాలుగు ఫోటోలు మాత్రమే చూసింది తను. రాంబాబు నీలిమల ఫోటో చూడగానే దుఃఖంతో మిగతావి పక్కన పడేసి చూడలేదు.

సరోజ ఆ ఫోటోలని చేతిలోకి తీసుకుని ఒక్కొక్కటే చూడసాగింది.

పువ్వులనీ, పక్షులనీ, ప్రకృతిదృశ్యాలనీ చాల చక్కగా ఫోటోలు తీసింది నీలిమ.

చివరగా ఆ ఫోటోని చూసి సరోజ కెవ్వున అరిచింది.

అలా ఆశ్చర్యంతో అరిచిందో ఆమెకే తెలీదు.

నిప్పారిన కళ్ళతో ఆ ఫోటోవంక కొన్ని క్షణాల వరకూ చూసింది.

ఆమె గుండె వేగంగా కొట్టుకుంది.

ఇప్పుడు రాంబాబు ఎక్కడున్నాడో ....ఈ ఫోటో రాంబాబుకి చూపిస్తే ఎంత సంతోషిస్తాడో.....

సరోజ ఇలా అనుకుంటూ ఉండగానే కిష్టయ్య కంగారుగా పరుగెత్తుకుంటూ వచ్చాడు.

కిష్టయ్య కంగారుచూసి సరోజ కంగారుపడింది.

'ఏంటి కిష్టయ్యా?..... ఏమైంది..... రాంబాబు ఏడి?'

కిష్టయ్య తనూ రంబాబూ రంగనాధరావు ఇంటికి వెళ్ళడం తను బయటకాపలా ఉండడం, రాంబాబు లోపలికి వెళ్ళడం రంగనాధరావు ఇంట్లో రహస్య ద్వారం ఉండడం, రాంబాబు లోపలఉండగా రంగనాధరావు ఇంట్లోకి వెళ్ళడం అంతా వివరంగా చెప్పాడు.

'రంగనాధరావు లోపలికి వెళ్లాక రాంబాబు బయటికి రాలేదు. దాదపు గంట అయ్యింది. రంగనాధరావు రాంబాబుని ఇంట్లో బంధించాడనుకుంటా.......'

ఆయాసపడుతూ చెప్పాడు కిష్టయ్య.

'అందుకని ఆయన్ని అలా ఒంటరిగా వదిలేసి వచ్చావా?' సరోజ కోపంగా అడిగింది.

'మరి అంతకన్నా ఏం చెయ్యమన్నారు?'

'రంగనాధరవు ఇంటికి వెళ్ళి మా రాంబాబు మీ ఇంటికి వచ్చాడు ఏమయ్యాడు అని అడిగి ఉండాల్సింది.'

'భలేవారే మీరు. అలా అంటే నన్నూ లోపలికి లాక్కెళ్లి బంధించి ఉండేవాడు. . అప్పుడు మా ఇద్దరి సంగతి మీ కెవ్వరికీ తెలీదు....మేము సంపాదించిన రహస్యాలు కూడా మాతోనే అంతరించి పోతాయి.... అందుకే ఇక్కడికి పరుగెత్తుకుని వచ్చాను.....'

'నీలిమ డైరీ, స్మగ్లింగ్‌కి సంబంధించిన కాగితాలు ఉన్నావు ఏవీ?'

కిష్టయ్య చొక్కా ఎత్తి పొట్టలో దోపుకున్న డైరీ, కాగితాలూ తీసి ఇచ్చాడు.

సరోజ స్మగ్లింగు కాగితాలు తిరగేసి చూసింది. నీలిమ డైరీలోని పేజీలు గబగబా తిరగేసి చదివింది.

సరోజ కళ్ళు మెరిసాయ్.

ఆ డైరీలో నీలిమ తనకి భర్త స్మగ్లింగు రహస్యాలు తెలిసినట్టు ఈ విషయమై తనకీ భర్తకీ పడనట్టూ, తను రంగనాధరావు స్మగ్లింగుకి దూరంగా ఉండని పక్షంలో పోలీసులకి చెప్తానని బెదిరించినట్టు ఉంది.

'ఇంక రాంబాబు చిక్కుల్లోంచి బయట పడినట్లే.....' సంతోషంగా అంది సరోజ.

'అదెలా?.... హంతకుడికి హత్యకి సంబధించిన ఆధారాలు దొరకాలిగా?' అన్నాడు కిష్టయ్య.

సరోజ తన దగ్గరున్న ఫోటో చూపించింది.

ఆ ఫోటోని చూస్తూనే కిష్టయ్య కూడా కెవ్వున అరిచాడు.

'పద.....మనం ఇంక ఆలస్యం చేయకూడదు..... రంగనాధరావు నాకు తెలుసుకదా....ఊరికే పలకరించడానికి వెళ్లినట్టు వెళ్దాం, రాంబాబు అక్కడే ఉన్నాడో వేరే ఎక్కడైనా బంధించారో చూద్దాం.....' అంది సరోజ హడావిడిగా గదిలోంచి బయటికొస్తూ.

కిష్టయ్య ఆమెని అనుసరించాడు.

సరోజ భీమేశ్వరరావుకి నీలిమ డైరీ , స్మగ్లింగ్ కాగితాలు ఆ ఫోటో ఇచ్చి అతనికి ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చింది.

ఆ తరువాత ఇద్దరూ రాంగనాధరావు ఇటికి వెళ్లారు.

సరోజ , కిష్టయ్య కాంపౌండ్ వాల్ దాటి గుమ్మందగ్గర తచ్చాడసాగారు.

కిష్టయ్యా, సరోజ మెల్లగా లోపలికి అడుగుపెట్టారు.

అంతే.....

తలుపుల వెనుకనుండి రెండు బలమైన హస్తాలు వాళ్ళ నోళ్ళు మూశాయి.

## *ఫ్రేమ్ - 34*

### *అతనే బిగ్‌బాస్ !*

'హూహూ హోహో హ్హొ హ్హొ హ్హొ......'

బిగ్‌బాస్ వికటాట్టహాసం చేశాడు.

అక్కడ డెన్‌లో రౌడీల మధ్యన రాంబాబు, సరోజ, కిష్టయ్య ముగ్గురూ నిలబడి ఉన్నారు. వాళ్ళు ముగ్గురూ బిగ్‌బాస్ నవ్వును పట్టించుకోకుండా వాళ్లలో వళ్ళు గుసగుస లాడుకుంటున్నారు.

బిగ్‌బాస్ విసుక్కున్నాడు.

'ఈ మైక్‌తో పెద్ద చిక్కొచ్చిపడింది......' అని మైక్‌ని చేత్తో తట్టాడు.

తరువాత మైక్‌మీద మూతిపెట్టి ఊదాడు.

'హలో .....మైక్ టెస్టింగ్.....వన్ ......టూ......థ్రీ.......హుహూహూ హ్హొహోహ్హొ ......'

మళ్ళీ గట్టిగా నవ్వాడు.

ఉహు...... రాంబాబు వాళ్ళు అతని వంక చూడనే చూడలేదు. వాళ్ల గుసగుసల్లో వాళ్ళున్నారు.

బిగ్‌బాస్ బాధగా తల విదిలించాడు.

హలో....మైక్ టెస్టింగ్ ..... వన్ ....టూ ......థ్రీ..... హూహూ హ్హొ హ్హొ హ్హొ .....' మరోసారి నవ్వాడు.

'మైకేం పాడవలేదు బాస్...నీ నవ్వు మాకు బాగానే వినబడుతుంది ......' అన్నాడు జాకాల్.

'మరి ఆ విషయం ఇందాకట్నుండీ చెప్పవేం? నేను అవస్థపడుతూ ఉంటే .....వాళ్ళెందుకలా పట్టించుకోకుండా నిలబడ్డారు?' మండిపడ్డాడు బిగ్‌బాస్.

'ఏం పట్టించుకోమంటావ్?..... వచ్చిందగ్గర్నుండీ నవ్వుతూనే ఉన్నావ్ ఇహ ఆ నవ్వుకి విలువేం ఉంటుంది?' రాంబాబు కూడా కోపంగా అన్నాడు.

'నిజమే ..... ఇన్నాళ్ళూ తను ఆ విషయం గురించే ఆలోచించలేదు అనుకున్నాడు.

'నువ్వు నువ్వు..... ఇంకా ఎతకాలం నవ్వుతావ్‌లే...నీలిమని హత్య చేసినందుకు ఇంతకింత అనుభవిస్తావ్ రంగనాధరావ్...నీ పాపం పండింది.....' అంది సరోజ.

రంగనాధరావు ఉలిక్కిపడ్డాడు.

తనే బిగ్‌గాస్ అని వీళ్లకి తెల్సిపోయింది! ఇక వీళ్ళని వదిలిపెట్టే లాభంలేదు.

'పీటర్......' అంటూ గట్టిగ కేకపెట్టాడు రంగనాధరావు నెత్తిమీద షెల్ట్‌హాట్‌ని సర్దుకుంటూ.

'హుహూ హ్హొ హ్హొ హ్హొ .....' భయంకరంగా నవ్వుకుంటూ పీటర్ ఓ మూలనుండి వచ్చాడు.

'ఏం నాయనా..... ఇప్పుడు నవ్వటం నీ వంతా?.... అంతలా కప్పలా నోరు తెరిచి నవ్వుతున్నావ్‌గానీ నీ పుచ్చుపళ్ళు ఎంత అసహ్యంగా కనిపిస్తున్నాయో తెల్సా...నవ్వింది చాల్లే ఇంక నోర్మూయ్.....' అన్నాడు కిష్టయ్య.

పీటర్ బిత్తరపోయి నోరు మూసుకున్నాడు.

'హా.....' బాధగా తల విదిలించాడు రంగనాధరావు 'జాకాల్!...... మనం రౌడీలను అప్పాయింట్ చెయ్యడంలో ఏదో లోపం ఉంది. కుర్రనాయాలు కూడా మన పీటర్‌ని లెక్కచెయ్యడం లేదంటే ఎంత షేమ్!!......'

జాకాల్ విసురుగా పీటర్ వంక తిరిగాడు.

'పీటర్!..... ఒక కుర్రసన్నాసి నోరు ముయ్యమని అనగానే నోరు ముయ్యడమేనా?..... నువ్వు నీ యిష్టం వచ్చినంతసేపు నవ్వు.....' అన్నాడు ఆవేశంగా.

పీటర్ మళ్ళీ వికటాట్టహాసం చేయడం మొదలుపెట్టాడు.

హుహూహూహూహాహ్హాహ్హా.....'

'నీ నవ్వుకి వాళ్ళేం భయపడ్డం లేదుగానీ మాకు తల్నొప్పి వస్తుంది......చాల్లే ఇక నోర్మూయ్.....టైమంతా వెధవ నవ్వుతో వేస్టు చేస్తున్నావ్.....'

రంగనాధరావు విసుక్కున్నాడు.

ఏంటి బాస్.....మీరు వాళ్లముందూ వీళ్ళ ముందూ తిట్టబట్టే మాకు విలువపోతూంది. ' పీటర్ మొహం చిన్నది చేస్కుంటూ అన్నాడు.

'ఊ.....ఊ..... అనవసరంగా ఎక్కువ మాట్లాడకు నీ జీతంలో కోత కోస్తా..... పిస్టల్‌ని పొజిషన్‌లో పట్టుకో ......ఊ..... మీరు ముగ్గురూ వరసగా నిల్చోండి......మీయిష్ట దైవాన్ని ప్రార్థించుకోండి..... ఆ తరువాత పీటర్ మిమ్మల్ని షూట్ చేస్తాడు.....' అన్నాడు రంగనాధరావు.

'ఏంటీ.....ఈ దేభ్యం మొహమా?...... మమ్మల్ని షూట్ చేస్తాడా? ..... అసలు ఈ మొహానికి పిస్టల్ పట్టుకోడంవచ్చా అని?' సరోజ మొహం చిట్లిస్తూ అంది.

పీటర్ మొహం కందకడ్డాలా మారింది.

'పిస్టల్ పట్టుకోడం రాదా?....హు ......చూడండీ....

పీటర్ కౌబాయి సినిమాలోలా పిస్టల్‌ని గిరగిరతిప్పి ఎడమచేతిలోకి మార్చుకుని మళ్ళీ గిరగిరాతిప్పి, దాన్ని మళ్ళీ కుడిచేతిలోకి మార్చుకుని తిప్పుకుంటే పొరబాటున పిస్టల్ ఎడమ కుడికన్ను మీద తగిలింది.

'ఇస్స్....హబ్బా.....' బాధగా మూలుగుతూ కన్నుమీదచెయ్యి పెట్టుకున్నాడు పీటర్.

సరోజ, రాంబాబు,కిష్టయ్యలు ఘొల్లున నవ్వారు.